క్లుప్తంగా

9, 10 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న గోవిందరావు

కంచిలి: పలాసలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సోంపేట మండల పార్టీ కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, కంచిలి మండల నాయకుడు కప్ప గోపీనాథ్, వివిధ సంఘాల నాయకులు ఆర్.రఘు, పి.క్రిష్ణ, శేషమ్మ ఉన్నారు.

యోగా విజేతకు సత్కారం


ఆశీష్‌ను అభినందిస్తున్న విద్యావిహార్ ప్రతినిధులు

కాశీబుగ్గ: నెల్లూరులో ఈ నెల రెండు, మూడు తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పలాస మండలం రామక్రిష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సంపతిరావు ఆశీష్ ప్రతిభ కనబర్చాడు. కాంస్య పతకం సాధించి సత్తాచాటాడు. దీంతో ఆశీష్‌ను విద్యావిహార్ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణావు తదితరులు అభినందించారు.

విద్యార్థినులకు స్విమ్మింగ్ దుస్తులు వితరణ


స్విమ్మింగ్ దుస్తులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం: స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో 1993లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్విమ్మింగ్ దుస్తులను మంగళవారం అందజేశారు. రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు విద్యార్థినులు శైలు, ధనలక్ష్మి, లక్ష్మిశెట్టి, పుష్పలు ఎంపికయ్యారు. దీంతో వారికి స్విమ్మింగ్ దుస్తులతో పాటు ప్రయాణఖర్చుల నిమిత్తం ఆర్థికసహాయం అందజేశారు. దక్కత అప్పారావు, దాస్, రుషిచౌదరి, ఆనంద్, బత్తుల రామారావు, కేజీబీవీ వ్యాయామ ఉపాధ్యాయురాలు భారతి ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరమణ తెలిపారు. పోటీలకు ఎంపికైన బి.కవిత, పి.ధర్మరాజు, బి.కార్తీక్‌లను మంగళవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల ఎనిమిది నుంచి పదో తేదీ వరకు అన్నమయ్య జిల్లాలో జరగనున్న పోటీలకు జిల్లా తరఫున వీరు పాల్గొంటున్నారని అన్నారు. కోచ్ ధర్మరాజును స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వమే బీమా చెల్లించాలి

టెక్కలి: వ్యవసాయం, ఉద్యానవన పంటలకు సంబంధించి బీమాను ప్రభుత్వమే చెల్లించాలని వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు పినకాన వైకుంఠరావు కోరారు.ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల తరఫున ప్రభుత్వమే బీమా చెల్లింపులు చేసేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత రైతులపై బీమా భారం వేస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

ఆరుతడి పంటలకు ప్రాధాన్యం

నందిగాం: రబీ సీజన్‌లో ఆరుతడి పంటలకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ సూచించారు. కల్లాడ పంచాయతీ కైజోలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల్లో అపరాలు, రాగి, వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

బాహుదా ఎండినది!

- మరమ్మతులకు నోచుకోని 11 ఓపెన్ హెడ్ చానెల్
- రైతులకు తప్పని సాగు కష్టాలు
- ఆశలు అడియాసలు చేసిన దానా తుఫాన్


నీరు లేకపోవడంతో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న బహుదానది

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం వాసులకు సాగు, తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. నీటికి ఆధారమైన బహుదానది పరవళ్లు తొక్కకపోవడమే దీనికి కారణం. నది ఎప్పుడు పరవళ్లు తొక్కుతుందా అని రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత ఏడాది సరైన వర్షాలు కురవకపోవడంతో నదిలో నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ ఏడాది అడపా, దడపా కురిసిన వర్షాలు నారు మడులు రక్షించుకునేందుకు ఉపయోగపడ్డాయే తప్పితే పంటల సాగుకు కలిసి రాలేదు. ఇటీవల ఏర్పడిన దానా తుఫాన్ రూపంలోనైనా భారీ వర్షాలు కురిస్తే పొట్ట దశలో ఉన్న ఖరీఫ్ పంటను దక్కించుకోవాలన్న ఆశలు ఇప్పుడు ఆడియాసలయ్యాయి.

ఒడిశాలో పుట్టి..

ఇచ్ఛాపురం మండలంలో ప్రవహిస్తున్న బహుదానది ఒడిశాలో పుట్టి బొడ్డబడ మీదుగా 25 కిలోమీటర్ల మేర 35 గ్రామాలకు తాగు, సాగునీటిని అందిస్తూ డొంకూరు మత్స్యకార గ్రామం వద్ద ఉన్న బంగాళాఖాతంలో కలుస్తోంది. ఆంధ్రాలో వర్షాలు కురవకపోయినా ఒడిశాలో కురిస్తే బహుదానది నిండుకోవడంతో పంట పొలాలకు సాగునీరు అందేది. అయితే ఒడిశా ప్రాంతంలోని బహుదానదిలో డ్యామ్‌లు కట్టడంతో వరద నీరు నిల్వ కావడంతో ఆంధ్రాకు పెద్దగా నీరు వచ్చే పరిస్థితి లేదు. తుఫాన్లు, భారీ వర్షాల సమయంలో మాత్రమే బహుదానది నిండుకుండలా దర్శనమిస్తోంది.

భగలట్టీ జలాశయం పైనే ఆధారం

ఒడిశాలో నిర్మించిన భగలట్టీ జలాశయం పైనే ఇచ్ఛాపురం వాసులు ఆధారపడుతున్నారు. డ్యామ్ నిల్వ సామర్థ్యం 106 మీటర్లు ఎత్తుకాగా, 95 శాతం మేర నీటిని నిల్వ ఉంచుతోంది అక్కడి ప్రభుత్వం. భారీ వర్షాలు పడిన సమయంలో కనీసం వంద మీటర్ల వరకు నిండితే తప్పా పూర్తిస్థాయిలో దిగువ ప్రాంతంలో ఉన్న ఆంధ్రాకు నీరు విడిచి పెట్టేందుకు అక్కడ అధికారులు ఆసక్తి చూపరు. దానా తుఫాన్‌కు ఒడిశాలో భారీ వర్షాలు కురిసినప్పటికీ భగలట్టీ డ్యామ్‌లో సైతం నిల్వ అంతంత మాత్రమే కావడంతో ఆంధ్రా వైపు నీటిని విడిచిపెట్టేందుకు అక్కడ ప్రభుత్వం విముఖత చూపించింది.

11 ఓపెన్ హెడ్ చానాళ్లు పునరుద్ధరిస్తే..

మండలం, మున్సిపాలిటీలో ఉన్న ఆరువేల ఎకరాలకు సాగునీరు అందివ్వాలంటే శిథిలావస్థకు చేరుకున్న 11 ఓపెన్ హెడ్ చానెళ్లను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. 2018లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు 11 గ్రోయిన్స్ పూర్తిగా కొట్టుకుపోవడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. బహుదానది నుంచి సాగునీటిని గ్రోయిన్స్ ద్వారా పంట పొలాలకు మళ్లించి ఖరీఫ్, రబీ పంటలను దర్జాగా పండించేకునేవారు. అప్పటి అధికార టీడీపీ ప్రభుత్వం వీటిని పునరుద్ధించకపోవడంతో 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పిరియా విజయ స్వయంగా గత ఏడాది ఆగస్టు పదో తేదీన జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలసి గ్రోయిన్స్ పరిశీలించి రూ.17 కోట్లతో అంచనాలు వేశారు. ఏడాది క్రితం రూ.28 లక్షలతో ఈదుపురం బహుదానది వద్ద కేశుపురం న్యూ గ్రోయిన్ నిర్మించారు. అనంతరం ఎన్నికలు రావడంతో మిగులు 10 గ్రోయిన్స్ గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పుడు రైతులు ఖరీఫ్ పంట కోసం వరుణుడు కరుణపైనే ఆధారపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్పందించి శిథిలావస్థకు చేరుకున్న ఓపెన్ హెడ్ చానెళ్లను పునఃరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

వర్షాలు కురిస్తేనే పంట దక్కేది



వరినాట్లు వేసిన సమయంలో కురిసిన వర్షం కొంత లాభాన్ని ఇచ్చినా ఇప్పటి వరకు సరైన వర్షం కురవకపోవడంతో పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోయే పరిస్థితి దాపురించింది. దానా తుఫాన్‌తో భారీ వర్షాలు కురుస్తాయన్న అధికారుల మాటలకు రైతుల్లో ఆశలు చిగురించినా ఒక్క చినుకు చుక్క కూడా పడకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ పంటపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. బహుదానదిలో నీరు అడుగంటి పోయింది. వరుణుడు కరుణిస్తేనే పంట చేతికి వస్తుంది.

– రంగాల కృష్ణారెడ్డి, రైతు, అరకబద్ర, ఇచ్ఛాపురం మండలం


శిథిలావస్థకు చేరుకున్న బొడ్డబడ రాజ్‌ఘాయ్ గ్రోయిన్


సాగునీరు లేకపోవడంతో దమ్ములకు నోచుకోని రత్తకన్న పంట పొలాలు

రహదారి నిర్మాణానికి మోక్షం

వజ్రపుకొత్తూరు రూరల్: పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలోని సీతాపురం గ్రామంలో ఏళ్ల తరబడి భూ వివాదంతో అభివృద్ధికి నోచుకోని రహదారికి ఎట్టికేలకు మోక్షం లభించింది. గ్రామంలో ప్రధాన రహదారి లేక గోర్జి వెంబడి ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించి అనేక ఇబ్బందులు పడ్డారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రధాన మంచినీటి బావి నీరు వెళ్లే డ్రైనేజీ సైతం ఈ గోర్జి వద్ద ఉండటంతో మురుగు నీరు మళ్లీ అదే బావిలోకి చేరి నిత్యం ప్రజలు అనారోగ్యం చెందేవారు. అయితే వీటి అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు అనేక సార్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ ఈ భూ వివాదం అభివృద్ధికి అటంకంగా మారింది. దీంతో దశాబ్దాలుగా ఈ సమస్య ప్రజలను వెంటాడుతూనే ఉండటంతో వీటి పరిష్కారానికి గ్రామస్తులు పార్టీలకు అతీతంగా మంగళవారం ఐక్యంగా ముందుకు కదిలారు. యంత్రాల సాయంతో పనులు చేస్తుండగా చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ నీహార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సద్దుమనిగించారు. ఈ పనులకు సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావుతో పాటు గ్రామ పెద్దలు, పలు పార్టీల నాయకులు, యువకులు పర్యవేక్షించారు.


పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నీహార్

సీదిరిని కలిసిన కంచిలి నేతలు

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కంచిలి మండల పార్టీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సీదిరిని కలిసిన వారిలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, నాయకులు దుర్గాసి ధర్మారావు, లడ్డు కేశవపాత్రో, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం ఉన్నారు.


అప్పలరాజును దుశ్శాలువతో సత్కరిస్తున్న కంచిలి నాయకులు

ఒడిశా మద్యం బాటిళ్లతో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా మద్యం బాటిళ్లు తీసుకొస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.డి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. డొంకూరు, ఈదుపురం గ్రామాల వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నాగరాజు, ఎన్.కామరాజు పది ఒడిశా మద్యం బాటిళ్లతో పట్టుబడినట్టు చెప్పారు. బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రాయితీపై ఆయిల్ ఇంజన్లు ఇవ్వాలి

సోంపేట: ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై ఆయిల్ ఇంజన్లు, టార్పాలిన్లు సరఫరా చేయాలని రైతులు వ్యవసాయాధికారులను కోరారు. పాత్రకొండ, కర్తలిపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తికి ఈ మేరకు రైతులు విజ్ఞప్తి చేశారు.

బెల్టు షాపులు నడిపితే చర్యలు

వజ్రపుకొత్తూరు రూరల్: మద్యం బెల్టు షాపులు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం దుకాణాల వద్ద విధిగా ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు పాటించకుంటే 9440902357, 8008779075 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

భక్తిశ్రద్ధలతో..

నాగుల చవితి వేడుకలు

నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రజలు మంగళవారం జరుపుకున్నారు. కుటుంబ సభ్యులంతా గ్రామ శివారు, పొలాల వద్ద ఉన్న పుట్టల వద్దకు వెళ్లి నువ్వులతో చేసిన చిమ్మి, కోడిగుడ్లను పుట్టలో వేసి పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరకుండా..ఆపద తలపెట్టకుండా చూడాలని నాగదేవతకు సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకున్నారు. చవితి రోజున పంట పొలాలను సందర్శిస్తే మంచిదనే సంప్రదాయాన్ని రైతు కుటుంబాలు పాటించాయి. చవితి సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకుంది. కార్తీక దీక్షల్లో భాగంగా శివాలయాల్లో దర్శనాలు, దీపాలంకరణ సేవలు చేశారు. సాయంత్రం బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. కొన్ని గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్


వజ్రపుకొత్తూరు: నాగ దేవతకు పూజలు చేస్తున్న భక్తులు


టెక్కలి: పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


కవిటి: పుట్టవద్ద మొక్కులు చెల్లించుకుంటున్న రైతు కుటుంబం


కంచిలి: పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు


నందిగాం: హరిదాసుపురంలో కోయనృత్యాలతో అలరిస్తున్న కళాకారులు


నందిగాం: కణితూరులో పుట్ట వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ తదితరులు


ఇచ్ఛాపురం రూరల్: ధనరాజులమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబ సభ్యులు


వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురం,పెదవంకలో నాగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


ఇచ్ఛాపురం: రామలింగేశ్వరాలయం పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


కాశీబుగ్గ: కోసంగిపురం జగనన్నకాలనీ వద్ద పూజలు చేస్తూ..


ఇచ్ఛాపురం రూరల్: కొరాలీలో పుట్టులో పాలు పోస్తున్న మహిళలు

రోడ్డు పనులు ప్రారంభం



వజ్రపుకొత్తూరు మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 9.51 కోట్లు వెచ్చించి సీసీ రహదారులు పనులు చేపడుతున్నామని పంచాయతీరాజ్ ఏఈఈ పి.నాగభూషణరావు తెలిపారు. పలు చోట్ల జరుగుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. కొమరల్తాడ, కొత్తపేట, ఉద్దానం రామక్రిష్ణాపురం, దేవునల్తాడ గ్రామాల్లో ప్రస్తుతం పనులు చేపడుతున్నామన్నారు. కొమరల్తాడ పంచాయతీలో రూ. 30 లక్షలతో పనులు జరుగుతున్నట్టు చెప్పారు. సైట్ ఇంజినీర్ శ్రీధర్, కొమరల్తాడ మాజీ సర్పంచ్ దుర్గి నారాయణ స్వామి ఉన్నారు.

– వజ్రపుకొత్తూరు

భక్తుల సందడి



ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం మహేంద్రగిరి పర్వతాలకు భక్తుల తాకిడి పెరిగింది. కార్తీక మాసం సందర్భంగా భక్తులు మహేంద్రగిరిపై ఉన్న శివాలయానికి వెళ్లి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం నాగుల చవితి సందర్భంగా భక్తులు సందడి చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి వనభోజనాలు చేశారు.

–కాశీబుగ్గ

సర్పాల సయ్యాట..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 19వవార్డు సూర్యకాలనీ సమీపంలో రెండు సర్పాలు సయ్యాటకు దిగాయి. మంగళవారం నాగుల చవితి పుట్టవద్ద పూజలకు స్థానికులు వెళ్తుండగా పాములు కనిపించాయి. దీంతో కొంతమంది వీటిని తమ సెల్‌ఫోన్లలో బంధించగా.. మరికొందరు పాలు, కోడిగుడ్లు పెట్టేందుకు ప్రయత్నించారు. నాగుల చవిత రోజున పాములు కనిపించడంతో సంతోషంతో పూజలు చేశారు.

కాశీబుగ్గ

శ్రమదానంతో..



సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురం గ్రామస్తులు శ్రమదానంతో మురుగు కాలువలను మంగళవారం శుభ్రపరిచారు. కాలువల్లో ప్లాస్టిక్, గాజు సీసాలు, చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరేంది. ఫలితంగా పారిశుద్ధ్యం క్షీణించింది. స్పందించిన స్థానికులు స్వచ్ఛందంగా వాటిని తొలగించి సమస్యను పరిష్కరించుకున్నారు.

–సంతబొమ్మాళి

స్తంభంపై నుంచి పడి జూనియర్ లైన్‌మెన్ దుర్మరణం

మధురవాడ : విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి జూనియర్ లైన్‌మెన్ మృతి చెందారు. ఈ ఘటన జోన్–3 కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి 7.30 గంటలకు కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి మారికవలస టొయోటా షోరూం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ బ్రేక్ డౌన్ అయింది. సమాచారం అందుకున్న జూనియర్ లైన్‌మెన్ బలివాడ వెంకటేష్(37) అక్కడకు చేరుకొని విద్యుత్ స్తంభం ఎక్కి పనులు పూర్తి చేసుకుని కిందికి దిగే క్రమంలో స్తంభం పైనుంచి జారి పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో సహచర సిబ్బంది సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుడి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పలాస సమీపంలోని హరిపురం. కొన్నాళ్ల క్రితం లక్ష్మీమనోహరితో వివాహం జరిగింది. ఐదేళ్ల నుంచి కొమ్మాది సెక్షన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ రిక్షా కాలనీలో నివాసం ఉంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. సెక్షన్‌లో మంచి ఉద్యోగిగా పేరు సంపాదించుకున్న వెంకటేష్ మరణంతో సహచర సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు.


ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్ కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై బన్నువాడలో సోమవారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారువిధిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడవద్దని, మద్యం తాగి వాహనాన్ని నడపవద్దన్నారు. కారులో వెళ్లేవాళ్లు విధిగా సీటు బెల్టు ధరించాలని చెప్పారు.